క్లుప్తంగా

ఉరుకుందలో భక్తుల సందడి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్నస్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన

మంత్రాలయం రూరల్ : ఎలాంటి రసాయానాలు లేకుండా రైతులు పండించే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు ఆరోగ్యకరమని రైతు సాధికార సంస్థ మండల ఇన్‌చార్జ్ పద్మశ్రీ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో వ్యవసాయశాఖ, రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆకుకూరలు, కూరగాయాలను విక్రయించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు లక్ష్మీ, గౌరమ్మ, శృతి, రమేష్ పాల్గొన్నారు.

ఆడుదాం..ఆంధ్ర నిధులపై విచారణ



నిధుల విచారణ చేస్తున్న డీసీటీఓ వెంకటరమణ

మంత్రాలయం రూరల్: గత ప్రభుత్వ హయాంలో ఆడుదాం ఆంధ్ర క్రీడలు నిర్వహించిన విషయం విధితమే. క్రీడలకు సంబంధించి ఒక్కో గ్రామానికి ప్రభుత్వం రూ.10 వేలు కేటాయించడం జరిగింది. ఆ నిధుల వినియోగంపై ప్రస్తుత ప్రభుత్వం విచారణ చేపట్టింది. ప్రాథమికంగా ఆయా గ్రామ సచివాలయాల సర్పంచులు, కార్యదర్శులతో విచారణ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డీసీటీఓ విజిలెన్స్ అధికారి వెంకటరమణ విచారణ చేపట్టారు. విచారణలో ఎంపీడీఓ నూర్జహాన్, డిప్యూటీ ఎంపీడీఓ ఈశ్వరయ్యస్వామి, ఏవో రాధ తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ కార్యాలయ ముట్టడిని జయప్రదం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: ఉపాధ్యాయ సమస్యలపై బుధవారం చేపట్టనున్న డీఈఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఐక్య ఉపాధ్యాయ సంఘ నాయకులు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని వీవర్స్ కాలనీ జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఐక్య ఉపాధ్యాయ సంఘ నాయకుల సమావేశం నిర్వహించారు. ముట్టడి కార్యక్రమానికి సిద్ధం అంటూ నినాదాలు చేశారు. ఆయా సంఘాల నాయకులు వెంకటేశ్వర్లు, తిమ్మరాజు, దావీదు.కౌలన్న, రామచంద్ర మాట్లాడారు. విద్యాశాఖ ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని డిమాండ్ చేశారు.

సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

కౌతాళం: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. సప్లిమెంటరీ పరీక్షలకు కౌతాళంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతో పాటు ప్రతిభ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాలను మండల విద్యాధికారిణి శోభ రాణి తనిఖీ చేశారు. మొదటి రోజు తెలుగు పరిక్షకు 119 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 79మంది హాజరైనట్లు తెలిపారు.

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బాలుర ఉన్నత పాఠశాల, మౌంట్‌కార్మెల్ పాఠశాలలో తెలుగు పరీక్షలకు 160 మంది విద్యార్థులకు గానూ 96 మంది హాజరు కాగా, 64 మంది గైర్హాజరయ్యారు.

పోలీసుల అదుపులో బెట్టింగ్ నిర్వాహకులు?

ఆదోని అర్బన్: పట్టణంలో ఐపీఎల్ బెట్టింగ్ నిర్వాహకులను పోలీసుల అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వారిని ప్రత్యేక ప్రదేశంలో ఉంచి విచారణ చేపడుతున్నట్లు తెలిసింది. దాదాపు ఐదు నుంచి ఆరుగురు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది.

రమణీయం.. వెండి రథోత్సవం

- అశేష జనవాహిని మధ్య సాగిన మహాయోగి లక్ష్మమ్మవ్వ రథోత్సవం
- మార్మోగిన అవ్వ నామస్మరణ
- రథం ముందు కలశాలతో మూసానహళ్లి మహిళలు
- భక్తులకు అన్నదానం, మజ్జిగ పంపిణీ



అశేష జనవాహిని మధ్య అవ్వరథోత్సవం (ఇన్‌సెట్) లక్ష్మమ్మవ్వ బంగారు ఉత్సవ విగ్రహం

ఆదోని అర్బన్: ఆదోని ప్రజల ఇలవేల్పు శ్రీమహాయోగి లక్ష్మమ్మవ్వ 93వ వెండి రథోత్సవం సోమవారం ఆలయ నిర్వాహకులు రాచోటి రామయ్య ఆధ్వర్యంలో అశేష జనవాహిని మధ్య కనుల పండువగా జరిగింది. అవ్వవారి బంగారు విగ్రహాన్ని అవ్వా సేవాసమితి సభ్యులు వెండి రథంలో కొలువుదీర్చి ఉత్సవాన్ని ప్రారంభించారు. డోలు, సన్నాయి, బాజా భజంత్రీల మధ్య రథోత్సవం ముందుకు సాగింది. లక్ష్మమ్మవ్వకు జై అనే నామస్మరణతో పట్టణ వీధులు మార్మోగాయి. దాదాపు 4 గంటల పాటు రథోత్సవం పురవీధుల గుండా సాగగా.. భక్తులు అవ్వవారిని దర్శించుకున్నారు. రథం ముందు మూసానహళ్లి గ్రామ చిన్నారులు, మహిళలు కలశాలతో ముందుకు సాగారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్

మహాయోగి లక్ష్మమ్మవ్వ వారిని 93వ వెండి రథోత్సవంలో భాగంగా సోమవారం ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఎస్పీ హేమలత దర్శించుకున్నారు. ముందుగా ఆలయ నిర్వాహకులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అవ్వకు ప్రత్యేక పూజల అనంతరం వారిని శాలువా కప్పి సన్మానించారు. లక్ష్మమ్మవ్వ జ్ఞాపికను అందజేశారు.

గోడంబి, బాదామిలతో అలంకరణ

మహాయోగి లక్ష్మమ్మవ్వ విగ్రహానికి తెల్లవారుజామున క్షీరాభిషేకం, పట్టువస్త్రాలు, పూల అలంకరణతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేకంగా గోడంబి, ద్రాక్ష, బాదామిలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వేకువజాము నుంచి రాత్రి 11 గంటల వరకు పట్టణ, గ్రామీణ భక్తులు, కొత్తగా పెళ్లి అయిన జంటలు, అవ్వవారిని దర్శించుకున్నారు.

అన్నదానం

ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేశారు. అవ్వ రథోత్సవం సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి ఆలయ నిర్వాహకులు ప్రధాన రహదారుల్లో, అవ్వ ఆలయం ముందు డేరా వేసి భక్తులకు అన్నదానం



కలశాలతో మూసానహళ్లి గ్రామ మహిళలు



భక్తులకు అన్నదానం చేస్తున్న సబ్‌కలెక్టర్

చేపట్టారు. ముందుగా సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ చేతులమీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అలాగే అల్కూరు మఠం మహర్షి విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో కూడా భక్తులకు మజ్జిగ, నీరు అందించారు.

భారీ బందోబస్తు

అవ్వ వారి రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ హేమలత ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. బందోబస్తులో సీఐలు శ్రీరామ్, రాజశేఖర్‌రెడ్డి, రామలింగమయ్య, గంటా సుబ్బారావు, ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా.. లక్ష్మమ్మవ్వ ప్రభోత్సవం



ప్రభోత్సవంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి లక్ష్మీకాంతరెడ్డి

నందవరం: అవధూత శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ జాతర మహోత్సవం సందర్భంగా సోమవారం కనకవీడు గ్రామంలో బాజా భజంత్రీలు, డోలు సన్నాయిల నడుమ అవ్వ ప్రభోత్సవం అత్యంత వైభవంగా సాగింది. ఆలయ పూజారులు లక్ష్మయ్య ఆచారి, వెంటేష్, శ్రీనివాసుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున అవ్వ వారి మూలవీరాట్‌కు క్షీరాభిషేకం, పట్టువస్త్రాలు, పూల అలంకరణతో విశేష పూజలు చేపట్టారు. అనంతరం భక్తులు, గ్రామస్తులు పిండి వంటలు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం లక్ష్మమ్మవ్వ చిత్రపటాన్ని ప్రభపై ఉంచి నంది కోలు సేవతో పాటు భక్తుల జయ జయ ధ్వానాల మధ్య ప్రభోత్సవాన్ని గ్రామం చివరి వరకు లాగి తిరిగి దేవాలయం యథాస్థానానికి చేర్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మేధావుల ఫోరం సంయుక్త కార్యదర్శి కే.లక్ష్మీకాంతరెడ్డి అమ్మవారి ప్రభోతసవంలో పాల్గొని, మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు రఘుమూర్తి స్వామి, గ్రామ సర్పంచ్ మద్దీశ్వరి, వైఎస్‌ఎంపీపీ షేక్‌సాహెబ్, ఎంపీటీసీ సుశీలమ్మ, ఉప సర్పంచ్ లక్ష్మీకాంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటరాముడు, భీమన్న, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన జొన్నలు మద్దతు ధరతో కొనుగోలు

ఆదోని రూరల్: రైతుసేవా కేంద్రాల ద్వారా నాణ్యమైన జొన్నలు (బియర్డ్ జొన్న) కనీస మద్దతు ధర్పై కొనుగోలు చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ బి.నవ్య తెలిపారు. సోమవారం సాయంత్రం మండలంలోని బసాపురం గ్రామంలో రైతుసేవా కేంద్రంలో జొన్న రైతులతో మాట్లాడారు. జేసీ మాట్లాడుతూ ఆదోని మండలంలోని బసాపురం, పెద్దహరివాణం, చిన్నగొనేహాల్, సంతెకూడ్లూరు గ్రామాల్లో 68 జొన్న రైతులను గుర్తించి సుమారు 2 వేల క్వింటాళ్ల కొనుగోలుకు అనుమతి ఇచ్చామన్నారు. నాణ్యతను పరిశీలించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో రైతుల నుంచి 2024–25 సీజనల్‌లో నాణ్యమైన జొన్నలు (బియర్డ్ టైప్) కనీస మద్దతు క్వింటా ధర రూ.3371కు కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, తహసీల్దార్ శివరాముడు, వ్యవసాయశాఖ అధికారి బాలవర్ధిరాజు, మండల వ్యవసాయశాఖ అధికారి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పౌర సరఫరా గోదాము తనిఖీ

ఆదోని పౌర సరఫరాల గోదాము పాయింట్‌ను సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ నవ్య, ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాములో ఉన్న రేషన్ నిల్వ, రికార్డులు,



జొన్నలను పరిశీలిస్తున్న జేసీ నవ్య

భద్రత తదితర అంశాలను పరిశీలించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజా సమస్యల పరిష్కారమే పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్‌ఎస్) కార్యక్రమం లక్ష్యమని, కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ నవ్య, సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం-పీజీఆర్‌ఎస్ నిర్వహించారు. డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సర్వేయర్స్ వేణుసూర్య, డీఎల్‌డీఓ రమణారెడ్డి, డీఎల్‌పీఓ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల గుర్తింపుపై దృష్టి సారించండి

మంత్రాలయం : నూతన పోలింగ్ కేంద్రాల గుర్తింపుపై పార్టీలకు అతీతంగా దృష్టి సారించాలని హెచ్ఎన్ఎస్ఎస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, నియోకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ కె.అనురాధ సూచించారు. సోమవారం సాయంత్రం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీ నేతలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల ఆధునికీకరణతో పాటు కొత్త పోలింగ్ కేంద్రాలు గుర్తించాలని ఆదేశించారు. అలాగే ఓటరు నమోదు ప్రక్రియ ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని చెప్పారు. పార్టీల నేతలతో సమన్వయం చేసుకుంటూ అధికారులు పోలింగ్ కేంద్రాల అంశాన్ని సాగించాలన్నారు. అధికారులు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసు



మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ

కునేందుకు సహకరించాలన్నారు. సమీక్షలో తహసీల్దార్ ఎస్.రవి, పెద్దకడబూరు తహసీల్దార్ గీతా ప్రియదర్శిని, కోసిగి తహసీల్దార్ రుద్రగౌడ్, డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) గురురాజారావు, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.



మంత్రాలయం వద్ద నిండుగా పారుతున్న తుంగభద్ర నది

తుంగభద్రకు జలకళ

మంత్రాలయం/నందవరం : ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలతో తుంగభద్ర నదికి వరద నీరు చేరుకుంది. ఆలూరు నియోజకవర్గం, కర్ణాటకలోని బళ్లారి ప్రాంతాల్లో శని, ఆదివారాలు వానలు భారీగా కురిశాయి. వంకలు పారడంతో వరద నీరు తుంగభద్ర నదిలోకి చేరింది. సోమవారం నది ప్రవాహం పెరగడంతో మంత్రాలయం నదీతీరం భక్తులతో కోలాహలంగా మారింది. నందవరం మండల పరిధిలోని జోహారాపురం గ్రామంలో తుంగభద్ర నది వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది.

కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా వెంకటేష్



కోసిగి: ఆంధ్ర ప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శిగా కొల్మాన్‌పేట గ్రామానికి చెందిన వలకల దిన్నె వెంకటేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 17న విజయవాడలో ఏకేఎఫ్‌ఐ మరియు ఎస్ఏపీపీ ఆధ్వర్యంలో ఆంధ్ర ప్రదేశ్ కబడ్డీ అసోసియేషన్ ఎలక్షన్ నిర్వహించారు.ఇందులో కొల్మాన్‌పేట గ్రామం నుంచి వలకదిన్నె వెంకటేష్ ఎన్నికయ్యారు.

ఏఈపై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు : మండలంలో పని చేస్తున్న విద్యుత్ ఏఈ సుబ్బారెడ్డి మండలంలో అందుబాటులో లేకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పెండింగ్‌లో ఉన్నాయని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు భాస్కర్ యాదవ్, మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మబ్బు ఆంజనేయ డిమాండ్ చేశారు. స్థానిక బస్టాండ్ ఆవరణలో రైతుసంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఆయన స్థానికంగా లేకపోవడంతో మండలానికి ఎప్పుడు వస్తాడో ఎప్పుడు పోతాడో ఎవరికీ తెలియదన్నారు. రైతులేమో వారి సమస్యల పరిష్కారానికి రోజూ విద్యుత్ సబ్ స్టేషన్ చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు, రైతులు దస్తగిరి, నరసింహులు, నరసయ్య, లక్ష్మన్న, ఆంజనేయ, మూకన్న, రాజు తదితరులు పాల్గొన్నారు.

గాయపడినవారిని ఆదుకోవాలి

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని సోమప్పనగర్‌లో శుక్రవారం రాత్రి నిర్మాణ భవనం పైకప్పు కూలి పక్కనే రేకుల షెడ్డులో ఉన్న వారిపై పడటంతో గాయపడిన వారిని ఆదుకోవాలని సోమవారం బాధిత కుటుంబ సభ్యులు తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం అందచేశారు. బాధితుడు కురవ శ్రీరాములు మాట్లాడుతూ ఆ రోజు రాత్రి పైకప్పు కూలటం వలన 12 మందికి గాయాలు అయ్యాయని, లిఖిత అనే చిన్నారి తలపై తీవ్ర గాయాలై కర్నూలులోని మెడికవర్ హాస్పిటల్లో చికిత్స పొందుతుందని తెలిపారు. ఇంత ప్రమాదం జరిగిన మున్సిపల్ కమిషనర్ గానీ, రెవెన్యూ అధికారులు కానీ చూడ్డానికి రాకపోవటం దురదుష్టకరమన్నారు. ఇంటి యజమాని ప్రమాదం జరిగిన రోజు కొద్ది సాయం చేసి ఇప్పుడు స్పందించటం లేదని వాపోయారు. వైద్య ఖర్చులకు సాయం చేసి, నిత్యావసర సరుకులు ఇవ్వాలని, రేకుల షెడ్ నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కురవ శివకుమార్, కురువ పురుషోత్తం, కురవ తరుణ్, ఏనుగుబాల సత్యారెడ్డి తదితరులు ఉన్నారు.

హనుమాన్ జయంతిని జయప్రదం చేయండి

గోనెగండ్ల : మండల కేంద్రంలోని శ్రీ రామాలయం దేవాలయంలో ఈనెల 22న నిర్వహించే హనుమాన్ జయంతిని జయప్రదం చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్య నిర్వహకుడు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్లలో శ్రీ సీతారామాంజినేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతికు సంబంధించిన బ్యానర్లను ఆవిష్కరించారు.కార్యక్రమంలో శ్రీరాములు యాదవ్, విశ్వ నాథ్ రెడ్డి, సత్యనారాయణ శెట్టి, జగదీష్, మునిస్వామి గౌడ్, రమేష్ పాల్గొన్నారు.

అక్రమ అడ్మిషన్లపై చర్యలు తీసుకోవాలి

ఆదోని రూరల్: ముందస్తుగా అక్రమ అడ్మిషన్లు జరుపుతున్న కిడ్డీస్, భాష్యం, అక్షరశ్రీ, శ్రీచైతన్య, ఇంటర్నేషనల్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) రాష్ట్ర అధ్యక్షులు పాగంటి రాజు, శివప్రసాద్‌గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. అక్రమ అడ్మిషన్లతో పిల్లల తల్లిదండ్రులతో వేలకు ఫీజుల రూపంలో డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, పరమేష్, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రాళ్లదొడ్డిలో వ్యవసాయ ప్రదర్శన

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని రాళ్లదొడ్డి గ్రామంలో బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం, జేసీ దివాకర్‌రెడ్డి వ్యవసాయ కళాశాల విద్యార్థులు సోమవారం రైతు వ్యవసాయ ప్రదర్శన, సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ రాఘవేంద్రచౌదరి మాట్లాడుతూ రాబోవు ఖరీఫ్ సీజన్‌లో రైతులు పంటల సాగులో సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటించాలన్నారు. రైతులు భూసార పరీక్షలకు అనుగుణంగా అనువైన పంటలను వేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో జేసీ దివాకర్‌రెడ్డి కాలేజీ అసోసియేట్ డీన్ డా. లక్ష్మీనారాయణరెడ్డి, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

ఆదోని రూరల్: హెచ్‌ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్డీప్ స్వచ్ఛంద సంస్థ మేనేజర్ మాలిక్ అన్నారు. సోమవారం పట్టణంలోని బాబుప్లాజా, పాత బస్టాండు వద్ద జానపద కళాకారులు హెచ్‌ఐవీ పట్ల అప్రమత్తంగా ఉండాలంటా జానపద పాటలతో అవగాహన కల్పించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, ఆర్డీప్ సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు.

ప్రశాంతంగా ఎంసెట్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్ కాలేజీలో సోమ వారం ఏపీ ఎంసెట్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కాలేజీ ప్రిన్సిపాల్ డా.సుధాకర్ మాట్లాడుతూ పకడ్బందీగా ఏపీ ఎంసెట్ నిర్వహిస్తున్నా మని చెప్పారు. వారం రోజుల పాటు పరీక్షలు ఉంటాయన్నారు. మొదటి రోజు 400 మందికి గాను 385 మంది హాజరైనట్లు చెప్పారు.

సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిద్దాం

ఆదోని రూరల్: పుచ్చలపల్లి సుందరయ్య వారసత్వాన్ని కొనసాగిద్దామని సీపీఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు గోపాల్, పట్టణ, మండల కార్యదర్శులు లక్ష్మన్న, లింగన్న పిలుపునిచ్చారు. సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని స్థానిక పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ముక్కన్న, తిప్పన్న, శ్రీనివాసులు, వీరేష్, తాయన్న, బొజ్జప్ప, హమాలీలు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: సీపీఎం వ్యవస్థాపకులు పుచ్చల పల్లిసుందరయ్య ఆశయ సాధనకు పార్టీలోని ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు రామాంజినేయులు పిలుపునిచ్చారు. పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గోవిందు, రాముడు, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు దేవసహాయం తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్యకు నివాళి

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రం మంత్రాలయంలో పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యం నిర్వహించారు. సోమ వారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీ ఎం నాయకులు అనిల్, ప్రణేష్ , లక్ష్మన్న, అంజి, ఏసీ నరసప్ప ఆచారి, ఇబ్రహీం పాల్గొన్నారు.

గోనెగండ్ల : కమ్యూనిస్టు మహానేత



ఆదోనిలో సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

పుచ్చలపల్లి సుందరయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సీపీఎం, ఆటో యూనియన్ నాయకుడు కరుణాకర్, నబిరసూల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రం గోనెగండ్ల ఆర్టీసీ బస్టాండ్‌లో సుందరయ్య 40వ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు బాబు, ఆది, నల్లరెడ్డి, రాజు, వీరేష్, వీరా తదితరులు పాల్గొన్నారు.